రచన ప్రతిష్ఠాత్మక జన్మదిన ప్రత్యేక సంచిక – ఫిబ్రవరి 1999

# కుచేలుడి కూతురు

ఈ దేశంలో లక్షలాది కుటుంబాలు తమ రోజులన్ని అంతంత మాత్రం సంపాదనతో వెళ్ళదీస్తూ ఉంటాయి. అయినా వీళ్లల్లో తొంభై తొమ్మిది మంది తాము అవస్థలు పడుతున్నామని ఎవరితోనూ చెప్పుకోరు. అయితే ఉన్న తనాన్ని, లేని తనాన్ని కూడా గుంభనగా కప్పెట్టి వుంచడం అసాధ్యం! ఇందులో ఆశ్చర్యం ఏమిటంటే ఉన్నవాళ్ళు ఎంతున్నా లేని వాళ్ళుగా కన్పించాలని అనుకోవడం, లేని వాళ్ళు ఓ మెట్టు పై నున్నట్టుగా ప్రవర్తించడం!! ఏది ఏమైనా ఓడలు బళ్ళుగా, బళ్ళు ఓడలుగా మారడం ఇది కూడా వింతే!!

రామచంద్రానికి వెనక ఆస్తి లేదు. చేసే ఉద్యోగం చిన్నది. అతను ఉంటూన్న రెండు గదుల యిల్లు తండ్రి నుంచి దక్కిందే! భార్య రుక్మిణికి సర్దుకుపోయే గుణం వుంది. పెద్దపిల్ల డిగ్రీకి వచ్చిన నాడు, కొడుకు వేణు టెన్త్ క్లాసు పాసయినప్పుడు - చుట్టుపక్కల అందరూ చెబితే - చదువలకయ్యే ఖర్చు విని ఆవిడ వణికి పోయింది. భర్త దగ్గర - తన భయాన్ని వెళ్ళబోసుకుంది. కానీ రామచంద్రం ఆమె మాటలు వినీ విననట్టుగా ప్రవర్తించాడు.

చాలా రోజులుగా రామచంద్రం తన సంసారాన్ని ఈదలేక నానా యిడుములు పడుతున్నాడు. ఒక్కొక్కసారి కాళ్ళు ఎత్తేసినా, చాలాసార్లు మొండి ధైర్యంతో అప్పులు చేస్తూ సంసార నౌకను లాగడం మొదలుపెట్టాడు. అలాంటిది - ఓ రోజున రుక్మిణి అనారోగ్యం పాలయ్యింది. డాక్టర్లు రకరకాల పరీక్షలు జరిపి ఆమెకు లంగ్‌కేన్సర్ వుందని తేల్చారు. ముందుగా రోగం పసిగట్టలేని మూలంగా ఆమె వేల ఖరీదు చేసే మందులు తిని బ్రతికింది... రుక్మిణి తనకు రోగం వచ్చినందుకు కాకుండా ఇల్లు అప్పుల పాలయినందుకు ఏడ్చింది... భర్తను చూసి జాలిపడి, ఆపైన పైన వున్న భగవంతుణ్ణి తిట్టిపోసింది. చదువూ, ఇంటి చాకిరీతో నలిగిపోయే కమలను చూసి బావురుమనేది....

కమలకు తల్లి అస్వస్థత - దానికయిన ఖర్చూ తెలుసు. ఇల్లు దిన దిన గండం, నూరేళ్ళాయిష్షుగా నడవడమూ అర్ధమయ్యింది. రామచంద్రం కూడా రుక్మిణిని బ్రతికించుకుందుకు - అయిన అప్పులు తీర్చడానికి ఇల్లు అమ్మేశాడు. భార్యకు కాపలాగా వుండడంతో, జీతం సరిగ్గా వచ్చేది కాదు.... రెండు నెలల తర్వాత రుక్మిణి ఓ రోజు బాధతో మెలికలు తిరిగిపోయి, ఆస్పత్రిపాలై, పదిరోజులు రోగంతో పోరాటం సలిపి చనిపోయింది... రామచంద్రం, కమల, వేణూ దు:ఖంతో మెలికలు తిరిగిపోయారు. అందరి కళ్ళల్లో కన్నీరు వర్షమై, వరదై పారింది. తల్లి వున్నప్పుడు - తల్లి వుందని అనుకునేటప్పుడు వుండే తృప్తీ, మానసిక ఆనందం, తన హృదయంలోంచి ఎవరో తొలగించినట్టుగా కమలకు అన్పించింది. వేణు ఇంట్లో కాలుగాలిన పిల్లిలా తిరిగేవాడు... బోసిపోయిన ఇంట్లో దిగులుగా కన్పించే తండ్రినీ, తమ్ముణ్నీ కమల తనే తల్లి అయి ఓదార్చవలసి వచ్చేది... రామచంద్రం ఓసారి ఇంటి పరిస్థితిని, తన సంపాదనను బేరీజు వేసుకొని నెమ్మదిగ కమలతో అన్నాడు... "నువ్వూ అమ్మ గురించి బెంగ పెట్టుకోకు. నువ్వు బాగా, చాలా బాగా చదువులో నిమగ్నమవ్వు... ఈ రోజుల్లో డిగ్రీకి విలువ లేదు. ఇంకా చదవాలి... నువ్వు పెద్ద ఉద్యోగం చేసి నేను ఆశ్చర్యపోయేటట్టు, ఆనందపడే టట్టుగా ఎదగాలి... నా అవస్తలు చూశావుగా - అలా కావద్దు నువ్వు..."

"చదువు ఇంకా కొనసాగించాలంటే ఇంకా అప్పులవుతాయి కదా నాన్నా.. అప్పుల బాధ తగ్గాలంటే చదువు మానేసి ఏదో ఉద్యోగం చూసుకుంటే పోతుంది... డిగ్రీ చాలదా?" కమల సంశయంగా అంది.

రామచంద్రం ఓసారి చిన్నగా నవ్వి, కాదన్నట్టు తలూపి, “వ్యాపారం చేసి బాగుపడే వాళ్ళు అప్పులకు వెనకాడరమ్మా... ఆ అప్పుకు రెండింతల లాభం ఎలా గణించవచ్చో వాళ్ళకు తెలుస్తుంది... అలాగే నీ చదువు కూడా... మంచి హోదా, బాగా జీతం దొరికాయి అనుకో.. ఈ అప్పులెంత” అంటూ కమలకు లోకరీతి చెప్పి, ధైర్యం అందించాడు.

కమలకు తండ్రి మనసులో ఉద్దేశం అర్థమయింది. తనతో చదువుకున్న స్నేహితులు డిగ్రీ తరువాత ఏం చేస్తున్నారో చెప్పగా వింది... కొందరు సాయంకాలం పూట నాలుగైదు గంటలు ఏ కంపెనీలోనో పనిచేస్తారు.

“నువ్వు రెండేళ్ళగా సాయంకాలాలు పనిచేసి, టైలరింగ్ చేసి సంపాదించిన డబ్బు ఎంతయ్యింది. ఇరవై వేలు కాలేదా.”

“అవును... ఆ డబ్బు...” కమల మాటలు ఆపేసి తల వంచుకుంది.

“ఒకవేళ ఏదో సంబంధం చూసి నీకు పెళ్ళి చేయాలనుకుంటే ఈ ఇరవై వేలు ఎందుకు పనికి వస్తాయంటావ్? పైగా దానికి రెండు మూడు రెట్ల డబ్బు వుంటేగాని నువ్వు గడప దాటడం కష్టం....”

“నిజమే... పైగా వేణుగాడు ఇంటర్‌లో జేరాలి... వాడి ఖర్చు వుంది నాన్నా... ఇప్పుడు నా పెళ్ళి గురించి మీరేమీ ఆలోచించవద్దు.... నేనూ ఆలోచించడం లేదు. అంతా, వాడి చదువయిన తర్వాతే...”

“అందుకే చెప్తున్నాను. నువ్వా డబ్బు నీ చదువుకే ఉపయోగించుకో. ఇప్పుడు అందరూ ప్రైవేటు కాలేజీల్లో చేరి కంప్యూటర్స్ చేస్తున్నారు. ఆ చదువుకి క్రేజ్ వుంది... కావాలంటే నీ స్నేమితుల్ని అడుగు... సరేనా” అని రామచంద్రం తన మనసులో ఉద్దేశం చెప్పాడు.

కమల తన ప్రాణ స్నేహితురాలైన అఖిలతో, మరికొందరితో తన భవిష్యత్ గురించి చర్చించింది. అందరూ కమల చెప్పింది విన్నారు. రామచంద్రం గారి ఆలోచనను పరిగణనలోకి తీసుకున్నారు. మొత్తం మీద కమల ఎం.సి.ఎ.లో చేరితే బేషుగ్గా వుంటుందనీ వాళ్ళూ ఓటు వేశారు. కమలకు మూడేళ్ళ చదువు, ఆ కష్టం, శ్రమా గుర్తు రాలేదు గానీ కట్టవలసిన ఫీజలు ఖర్చు ఊహిస్తేనే చెమటలు పట్టాయి... అఖిల అంతా విని నవ్వేసి, “అవసరం అయినప్పుడు నేను ఆర్థిక సహాయం చేస్తాను భయపడకు” అంది.

“మేం నీకు, ఎంత కావాలంటే అంత మోరల్ సపోర్ట్ ఇస్తాం, ప్రామిస్” అన్నారు కమల వీపు తట్టి, మరికొందరు స్నేహితురాళ్ళు.

కానీ కమలతో కలిసి చిన్నప్పటి నుంచీ చదువుకున్న ఆనంద్ కమల చెప్పిందంతా విన్నాడు. తల పంకించాడు. దీర్ఘంగా ఆలోచించాడు.

“ఏమిటీ... మైండ్ పని చేయటం లేదా?” అంది కమల.

“ఏమీ అనుకోనంటే నా అభిప్రాయం చెబుతాను...”

కమల తల ఊపింది...

"మధ్య తరగతి కుటుంబాల్లోని ఆడపిల్లలు పెద్ద చదువులుచదివినా లాభం వుంటుందని నేను అనుకోను. ఎందుకంటే ఈ రకం అమ్మాయిలు జీవితంలో ఎదుర్కోవల్సిన పెద్ద హార్డిల్, పెళ్ళి.. ఇక చదువుకైనా ఆపైన పెళ్ళికయినా కావల్సింది డబ్బు... అంటే ఇప్పుడు నువ్వు, మీ ఇంట్లో వాళ్ళు డబల్ ఇన్‌వెస్ట్‌మెంటుకు తయారయి ఉన్నారని నాకర్ధమవుతోంది...'

"అంటే...."

"ఈ మూడేళ్ళ చదువుకు నీ ఖర్చు... ఆపైన అన్నీ కుదిరితే పెళ్ళి ఖర్చు... యివి ఆలోచించావా నువ్వు?...."

"నా డిగ్రీ చూసి, చిన్న ఉద్యోగం చూసి నన్ను పెళ్ళిచేసుకునేవాడు దొరకడం కష్టం కాదా ఆనంద్? దానికి తోడు, మానాన్న ప్రస్తుతం కట్నాలు కానుకలూ ఇచ్చే స్థితిలో లేరు...."

"నిజమే అనుకో... కానీ... ఆడపిల్ల పెళ్ళికి అన్నిటితోపాటు వయసుకూడా ఓ ఎసెట్.. ముప్ఫై ఏళ్ళు దాటినా మగవాడికి ఎప్పుడూ మార్కెట్ వుంటుంది... అదే, అమ్మాయిలకయితే కష్టం.. కట్నం ఎక్కువ యివ్వాలి... పైగా లక్ష అనుమానాలకు తావిచ్చిన వాళ్ళమవుతాం..."

కమలకు మనస్సు చివుక్కుమంది. ఆనంద్‌మీద కాస్తంత కోపం వచ్చింది. అయినా తమాయించుకుని చిన్నగా నవ్వేసి అంది.

"చూద్దాం, రోజులు యిలాగే వుండవేమో.... మీ కుర్రకారు బుర్రల్లోంచి, పెద్దవాళ్ళ ఆలోచనల నుంచి ఈ పాత చింతకాయ పచ్చడి భావాలు దూదిపింజెల్లా ఎగిరే సమయం వస్తుంది..."

"కలలు కనడం వేరు కమలా"

"కొన్ని స్వప్నాలయినా వాస్తవం కావని ఎవరు చెప్పగలరు?"

"కానీ నీలాంటి అందగత్తెలకు ఆ భయం ఉండదనుకో" చిలిపిగా అన్నాడు ఆనంద్.

"ఆనంద్! నేను అందగత్తెని కానని, నాకు బాగా తెలుసోయ్. అలాగే నీలాంటి అబ్బాయిలు, ఇలా అప్పుడప్పుడు కితాబులు విసురుతూ ఉంటారనీ తెలుసు.. అవునా?" అంటూ కమల కిల కిలా నవ్వింది...

ఆనంద్ – ఎప్పటిలాగే కమల నవ్వు చూసి మురిసిపోయాడు. అతనికి కమల నవ్వు కొత్త అందాలకు నిర్వచనం విన్పిస్తూన్నట్టుగా ఉంటుంది. ఆమె చిన్నగా నవ్వితే, చుట్టూ ప్రకృతి తన నిత్య కృత్యాలు మానేసి తన్మయత్వంలో పడిపోతుందని అతను గొప్పగా ఊహించుకుంటాడు... నవ్వు నాట్యం కూడా చేయగలదనీ – అందుకు కమల నవ్వు ఒక్కటే గట్టి సాక్ష్యం అని అతను నమ్ముతాడు!!

"వెడతాను మరి" అంటూ కమల, తన ఇంటిదారి పట్టింది.

ఆనంద్‌కు చిన్నప్పటి నుంచీ కమలంటే చెప్పలేని వాత్సల్యం. ఇద్దరూ కలిసి

చదుకున్నారు. దాంతో స్నేహం - వయసుతోపాటు ఎదుగుతూ వచ్చింది... అయితే ఆశ్చర్యం ఏమిటంటే - అతను 'కమల తనది - తనదే' అని అనుకోగానే, వెంటనే అతనికి తన తల్లిదండ్రులు గుర్తుకు వస్తారు.. ఆపైన అప్పుచేసి చదువుకున్న ఇంటి పరిస్థితులు గుర్తుకు వస్తాయి.. కట్నం తీసుకుని కొడుకు పెళ్లి చేసి, ఆ డబ్బుతో చేసిన అప్పులు తీర్చి గట్టున పడదామనుకుంటున్న కన్నవారి ఆలోచనలు మనసులో కదులుతాయి! తను బాధ్యత పట్టవల్సిన చెల్లెలి పెళ్లి గుర్తుకు వస్తుంది...

దాంతో అతనికి - కమలమీద తను పెంచుకున్న ఆపేక్షకు ఎవరో అవరోధాలు కల్పిస్తున్నట్టుగా ఉంటుంది. చదువుకుందుకు తెరిచిన పుస్తకాలు - తమ మాటలు విన్పించడం మానేసి, ఏవో చేదు నిజాలు చెప్తోన్నట్టుగా అన్పిస్తుంది... తోటి స్నేహితులు, స్నేహితురాళ్లు వాళ్ల జీవితాల్లోని ఆశలు, అవరోధాలు అన్నీ గుర్తుకు వస్తాయి - కథలుగా! ముఖ్యంగా మధ్య తరగతి కుటుంబాల్లో పుట్టిన అమ్మాయిలే కాదు, అబ్బాయిలు కూడా, తమ తమ చాలా చాలా ఆశలకు, ఆనందాలకు నీళ్లు వదులుకోవల్సి వస్తుంది!! అవును - కంటికీ, మనసుకూ నచ్చిన అమ్మాయిని ప్రేమించే అవకాశం అబ్బాయిలకు దూరమవుతుంది... అడపిల్లల్లో చాలామంది మగపిల్లల్ని చూసి 'స్వేచ్ఛాపరులు ధైర్యవంతులూ' అని కితాబు ఇస్తారు. కానీ, డబ్బూ అంతస్తూ ఈ రెండే ఎవరు ముందడుగు వేయడానికైనా ప్రోత్సాహమిస్తాయని వాళ్లకు తెలియదు.

"ఎవరికైనాసరే ఈ రోజుల్లో మంచి ఉద్యోగం దొరకాలి. ఆ అదృష్టం కలిసి రావాలంటే నీ దృష్టి పుస్తకాల మీదే ఉండాలి... బజార్లో స్నేహితులు, సినిమాలు, టీ.వీలు కాలేజీలో కన్పించే అమ్మాయిలు - యివేవీ ముందుకు తీసుకు వెళ్లవు. ఇంటి బాధ్యత పట్టు..." అని తండ్రి చెప్పే మాటలు గుర్తొచ్చాయి, ఆనంద్‌కు! తనలో తనే, 'ఏమిటో అంతా గందరగోళంగా తయారయ్యింది...' అనుకుంటూ బస్ ఎక్కాడు ఆనంద్!!

❖ ❖ ❖

కమల ఎన్నో ఆర్థికపరమైన ఇబ్బందుల్ని , కష్టాల్ని ఈదుకుంటూ మూడేళ్ళ ఎం.సి.ఎ. కోర్సు అయిందనిపించింది... దానికి ప్రతిగా ఆమె కూడబెట్టిన ఇరవై వేల రూపాయిలు హరించుకుపోగా మరో పదిహేను వేలు అప్పు నికరంగా కళ్లముందు ప్రత్యక్షమయి కనబడింది. కంప్యూటర్ యజమాని సిస్టమ్స్ ప్రోగ్రామింగ్‌లో స్పెషలైజేషన్‌కు వెళ్లడం చాలా బావుంటుందనీ - భవిష్యత్ వుంటుందని సలహా యిస్తే కమల సంశయించింది మొదట...

"మళ్లీ ఇదో ఖర్చు కాదా సార్!" అంది...

"చూడమ్మా... ఈ కంప్యూటర్ విజ్ఞానం నదీ ప్రవాహం లాంటిది. ఇది కామాలు ఫుల్‌స్టాప్‌లు లేని చదువు... పూర్వం కోబాల్ లాంగ్వేజ్‌లోనే ప్రోగ్రామ్స్ రాసేవారు... అయితే త్వరత్వరగా సి-లాంగ్వేజ్, సి ప్లస్, సి ప్లస్ ప్లస్‌లూ వచ్చాయి. నీ బ్యాచ్‌లో

ఒకళ్లిద్దరు ఒరేకిల్ ఫైనాన్స్ నేర్చుకుంటున్నారు...."

"ఏది చేసినా బాగానే వుంటుంది గానీ, ఫీజు మాట వింటేనే భయం" అంది కమల చిన్నగా నవ్వి. సంస్థ యజమాని రెడ్డిగారు నవ్వేసి, కాసేపు ఆలోచించి అన్నాడు.

"మా సంస్థలో నీకు ఉద్యోగం ఇస్తాను. ప్రస్తుతానికి రెండువేలతో సరిపెట్టుకోగలవా?"

కమల తల ఊపింది. మొత్తం మీద కమల ఒకసారి వెనకడుగు వేసి, కాదనుకుని రెండడుగులు ముందడుగేసి ఒరాకిల్ ఫైనాన్స్‌లోకి దిగింది. రోజులు గడుస్తున్నాయి. తండ్రి జీతం, తన జీతం ఏమూలలకు సరిపోయేది కాదు... తరచు అఖిల సహాయం తీసుకోవాల్సి వచ్చేది... అలాంటప్పుడు ఒంటరిగా కూర్చుని ఆలోచిస్తే - ఏవేవో గుర్తుకొచ్చేవి... అవును తల్లి చనిపోయిన కొత్తలో అంతకు ముందు కూడా కమలకు తండ్రి మీద కొంత దురభిప్రాయం ఉండేది. ఆయన్ను తను అపార్థం చేసుకున్న సంగతి – కమలకు ఇంటి బరువు నెత్తికెత్తుకున్న తర్వాతగానీ తెలిసి రాలేదు...ఒక ఇంటి యజమాని తనజీతంతో ఇంటిని సాకుతూ భార్యా పిల్లల్ని కొద్దిగానైనా సంతోషపర్చాలంటే దానికి ఒట్టి జీతం సరిపోదనీ, అప్పులు కాక తప్పదనీ అర్థమయ్యింది....

కమల - ఆవేళ మామూలుగా ఎ.సి. రూమ్‌లో కూర్చుని కంప్యూటర్‌తో కుస్తీలు పడుతోంది.... యూనివర్శిటీ జరిపిన పరీక్షలో విద్యార్థుల మార్కులు ప్రింట్ చేసే కార్యక్రమం ఉంది అందుకే వళ్లు దగ్గర పెట్టుకుని డేటాలో తప్పులు పోకుండా చూసుకుంటోంది... సరిగ్గా అప్పుడే అఖిల ఫోన్ చేసింది.

"ఏమిటి విశేషం?"

"శుభవార్త" అంది అటునుంచి అఖిల. ఆ తర్వాత ఆమె తన పెళ్లి నిశ్చయమైన కబురు, పెళ్ళికొడుకు బయోడేటా అతను కాలిఫోర్నియాలో వుంటూన్న సంగతి, అన్నీ చెప్పి, 'సాయంకాలం ఇంటికి వచ్చి శుభలేఖ యిస్తాను. ఎటూ వెళ్లకు"

"ఎటు వెడతానే... ప్రస్తుతానికి ఈ ఇన్‌స్టిట్యూట్ అత్తవారిల్లు అనుకో... ఇంటికి వెళ్లేటప్పటికి రాత్రి ఎనిమిది అవుతోంది..."

"కమలా చిన్న ఐడియా వచ్చిందే చెప్పనా"

"చెప్పు"

"కమలా! నా పెళ్ళి అయిన వెంటనే అంటే ఒక నెలలో నేను రాజుతో అమెరికా - అదే కాలిఫోర్నియా వెళ్ళిపోతున్నాను. ఓ పని చేయరాదా... నువ్వూ అమెరికా వచ్చేయవే.. నీకెలాగూ కంప్యూటర్స్‌లో మంచి అనుభవం వుంది కాబట్టి రాజుతో చెప్పి వాళ్ళ 'విజువల్ సాఫ్ట్' కంపెనీలో ఉద్యోగం చూడమంటాను... ఓ రెండేళ్లు అక్కడ వున్నావంటే నీ సమస్యల్నీ తీరిపోతాయి..."

కమల వెంటనే ఏ జవాబు చెప్పలేదు. అఖిల మాత్రం అమెరికాలో వుంటూన్న వాళ్ళ గురించి ముఖ్యంగా ఏకాకులుగా జీవిస్తున్న అమ్మాయిల గురించి, అబ్బాయిల గురించీ

చెప్పింది. వాళ్ళు ఆర్థికంగా నిలదొక్కుకుంటూ, దూరంగా వుండే తల్లిదండ్రులకు ఏ విధంగా సహాయపడుతున్నారో, ఆ కథలన్నీ చెప్పి, "నువ్వు ధైర్యం చెయ్యవే... భయపడకు – మీ నాన్నగారితో చెప్పు... సరేనా, ఉంటాను" అంటూ ఫోన్ పెట్టేసింది అఖిల.

కమల సిటీబస్ ఎక్కి ఇంటికి వెడుతున్నా అఖిల చెప్పినమాటలూ, సలహాలు మర్చిపోలేకపోయింది. ఆలోచనలు రకరకాలుగా పోతూంటే నారాయణగూడాలో బస్ దిగింది. కాళ్లు అలవాటుగా విఠల్‌వాడి వైపు పోతున్నాయి. అప్పుడు వెనుక నుంచి ఆనంద్, "ఎలా వున్నావ్ కమలా?" అంటూ పలకరించాడు... కమల పరాకులో అతన్ని గమనించలేదు.

"నిన్నే కమలా... నిన్ను విష్ చేసి ఎలా ఉన్నావని అడిగాను. వినబడలేదా?" అంటూ పక్కనే నడక సాగించాడు, ఆనంద్.

కమల చిన్నగా నవ్వి "నువ్వా – ఎవరో అనుకున్నాను" అనేసింది.

"ఎలా వున్నావ్? కులాసానా?"

"నీకు కన్పిస్తున్నట్టుగానే ఉన్నాను. సరేనా" అంది.

ఆనంద్ పకపకా నవ్వేసి, ఆ తరువాత తేరుకుని తన విషయాలు చెప్పాడు.. కమల చదువు గురించి చేసే కంప్యూటర్స్ కోర్సు గురించి అడిగాడు. కమల తన గురించి చెప్పి ఆ తర్వాత, అఖిల పెళ్ళి కుదిరిన విషయం, ఆమె తనకిచ్చిన సలహా – ఆ సంగతులూ చెప్పింది.

"అందరూ ముఖ్యంగా మీ మొగపిల్లలందరూ అమెరికా దౌడు తీస్తూంటే నువ్వేం ప్లాను చేసుకోలేదా?"

"లేదు"

"ఎందుకని?"

"ఎందుకంటే – మూడేళ్ళు కాగానే, వెళ్ళినంత స్పీడుగానూ వెనక్కి రావల్సి వుంటుందేమోనని అనుమానం. అప్పుడు యిక్కడా అవకాశాలు దొరక్కపోతే అడగొద్దు... ఆ అవస్థ".

"అమెరికా వెడితే సంపాదించగల డాక్టర్లు... ఆ పైన ఇక్కడ పెళ్ళి కొడుకులకు మార్కెట్‌లో పెరిగే కట్నం రేటు... వీటి ముందు సాటి ఏముంది చెప్పు? ఇప్పటికే చాలామంది వీసా చూపించి కట్నాలు మాట్లాడుకుంటున్నారుట... నీకు తెలియదా?"

"ఈ సిద్ధాంతం అన్ని కులాల వారికీ వర్తించదు కమలా... ఈ మాత్రం తెలుసుకోలేకపోయావా?" నెమ్మదిగా అన్నాడు ఆనంద్.

కమల ఆనంద్ మొహం వైపు అదోలా చూసి, 'ఓ' అనేసింది నొచ్చుకున్నట్టుగా.

"అమెరికా వెళ్ళగల్గటం ఈ రోజుల్లో కష్టమైన పనేం కాదు కమలా... చాలా ఈజీగా వెళ్ళచ్చు... మన వాళ్ళు చాలామంది– అక్కడ చేయబోయే ఉద్యోగం గురించి కాకుండా

చేతిలో పడే డబ్బు గురించి, స్టేటస్ గురించి ఆలోచిస్తున్నారు. అక్కడ కంప్యూటర్స్ సంస్థల్లో మనవాళ్ళు చేసేది - ఇక్కడ మన కాంట్రాక్ట్ లేబర్ పని లాంటిదే!" ఎంత పని చేస్తే - అంత డబ్బు అనేది వాళ్ళ స్లోగన్! ఇక నా సంగతి, నాకు వచ్చే జీతంతో నేనిక్కడ హాయిగా బ్రతుకుతున్నాను."

"ఇక్కడ హాయిగా బ్రతకలేనివాళ్ళు అమెరికా వెళ్ళవచ్చునంటావ్?.. అంతే కదా?"

"అయితే నీ మాట చెప్పు?" అని ఆనంద్, కమలను ప్రశ్నించి - ఆమెను జవాబు చెప్పనివ్వకుండా తిరిగి, "ప్రస్తుతం నువ్విక్కడ సంతోషంగా బ్రతుకుతున్నావని నా ఉద్దేశం. అందుకే నువ్వు అమెరికా పరిగెట్టవని నేను అనుకుంటున్నాను" అన్నాడు.

కమలకు ఆనంద్ మాటలు అర్థం కాలేదు. అందుకే కాసేపు ఆలోచించి, "నువ్వు పొరబడ్డావేమో" అంది గుంభనంగా.

ఆనంద్ తనలో తానుగా, 'ఎక్కడ పొరపడ్డాను చెప్మా' అని కళ్ళు ఎగరేసి - ఆలోచిస్తోన్నట్టుగా మొహం పెట్టి, ఆ పైనచూపుడు వేలితో మూతి మీద చిన్నగా కొట్టుకుని - "కమలా నేను నడుస్తూ యాక్సిడెంటల్‌గా ఒకటి రెండుసార్లు పడ్డట్టు గుర్తుంది కానీ పొరపడ్డం మాత్రం జరగలేదు" అనేశాడు. ఆపైన చిన్నగా నవ్వేశాడు.

"చాల్లే నీ జోకులు -నువ్వూను" అని కమల పకపకా నవ్వేసింది! తర్వాత, అటూ ఇటూ చూసి "నే వెడతాను, మరి" అంటూ తన ఇంటి వైపు నడక మొదలుపెట్టింది...

ఆనంద్ కమల వెళ్ళిన వైపు చూస్తూ ఉండిపోయాడు - కొన్ని క్షణాలు కమల - తనను ఇంటికి రమ్మనమని ఆహ్వానించనందుకు - మాటవరుసకైనా ఆ మాట అననందుకు కాసేపు నొచ్చుకున్నాడు. పైగా తన మనసు దానికి తోడు తనని అందుకు వెక్కిరిస్తోన్నట్టూ ఫీలయ్యాడు. కానీ వెంటనే కమల నవ్విన అందమైన నవ్వుని గుర్తు చేసి చూపించి, ఆ మనసును మాయచేసి పారేశాడు!! ఆ తర్వాత అతను కమల నవ్వునే నెమరు వేసుకుంటూ ముందుకు అడుగులు వేశాడు.

❖ ❖ ❖

ఈ మధ్య రామచంద్రానికి ప్రతిరోజూ తన ఇంటి పరిస్థితిని బేరీజు వేసుకవోడం ఒక అలవాటుగా మారింది. ఈ అలవాటు కమల, డిగ్రీ పూర్తి చేసి యం.సి.ఏ.లో చేరినప్పటి నుంచీ మరీ ఎక్కువయింది. ఆ ఆలోచనల సారాంశం ఒకటే. అది కమల భవిష్యత్ ఎలా తీర్చిదిద్దాలన్నది. ఈనాటికి అనుకున్న చదువు పూర్తి అయింది. ఉద్యోగమూ దొరికింది... అందుకే తక్షణ కర్తవ్యంగా రామచంద్రం ముందు, కమల పెళ్ళి సమస్య తలెత్తి కూర్చుంది....

ఆయన ఇంట్లో కమలకు, వేణుకు చెప్పలేదు గానీ సంబంధాలు వెదుకుతూనే ఉన్నాడు. చాలామంది పెళ్ళివారు ఆయనను కూర్చోబెట్టి సవాలక్ష ప్రశ్నలు కురిపిస్తూనే ఉన్నారు. ఇల్లుందా, వాకిలుందా, ఆస్తుంటే ఎంతుంది లాంటి ప్రశ్నలు, అందులో కొన్ని!! కొందరికి

చదువుకుని ఉద్యోగం చేస్తూన్నా పిల్ల అందంగా ఉండాలి. ఇంకొందరికి పెద్ద కట్నం కావలి... మరొక చోట వియ్యంకుడు - అదే పిల్ల తండ్రి - గొప్ప ఉద్యోగస్తుడవ్వాలి! చాలామందికి - పెళ్ళి కాగానే అల్లుణ్ణి అమెరికా పంపగల మామగారంటేనే ఇష్టం!... ఇక సాధారణ ఉద్యోగి ధర యాభై వేల దగ్గర మొదలయి - ఉద్యోగస్థాయిని బట్టి పాదరసంలా అది పైకే పాకుతోంది!!

అలా పెళ్ళి సంబంధాలు వెదుకుతూ వుండే ప్రక్రియలో రామచంద్రాన్ని చిన్న భయం, కొంచెంలో కొంచెం నిస్పృహ చుట్టుముట్టకపోలేదు... ఆర్థికపరమైన ఇబ్బందులు అడ్డు తగిలినంత మాత్రాన - లోకం, కూతురుకు పెళ్ళి చేయలేని తండ్రికి ఏ విధమైన సానుభూతి అందివ్వదేమో! నానా ఇబ్బందులు పడుతున్నా అప్పు చేసి ఆ శుభకార్యం కానిచ్చి, ఆ పైన నడుం విరక్కొట్టుకున్న తండ్రికి దక్కే గౌరవంలో సగం కూడా కూతురిని తన గడపలో వుంచుకున్న వాడికి దక్కదు...

పోనీ ప్రపంచాన్ని, లోకాన్ని లెఖ్ఖ చేయకుండా పరిస్థితులను బట్టి వివేక మార్గాన పోదామన్నా - అదేమిటో తరచు అంతరాత్మ కూడా తలవంచుకుని పొమ్మనే సందేశాలు అందివ్వడం ఆయనకు ఆశ్చర్యంగా వుండేది. ఇదే అంతరాత్మ మగపిల్లవాడి విషయంలో, మగపిల్లల విషయంలో భిన్న రూపాలలో దర్శనమివ్వడం రామచంద్రానికి ఆశ్చర్యాన్ని కలగజేసేది... అందుకే ఆయన ఒక్కొక్కప్పుడు ఈ ఇంద్రజాలాలు చేసేది అంతరాత్మ కాదని - మరేదో మాయా పదార్థమని - యివన్నీ మనసు చేసే విన్యాసాలేననీ అనుకునేవాడు...

రామచంద్రానికి నవ్వొచ్చింది... కుర్చీలోంచి అటూ ఇటూ కదిలి.... "ఏం చేస్తున్నావమ్మా కమలా?" అని పిలిచాడు.

కమల లోపలి నుంచే, "వంట పనిలో ఉన్నాను, నాన్నా" అంటూ జవాబు ఇచ్చింది.

కమల నిజానికి, అప్పుడు వంటింట్లో వంట పనే చేస్తోంది! కానీ ఆమె పరధ్యాన్నంగా ఉంది! ఆమె ఆలోచనలు ఎప్పుడో వంట గదినీ, వీధినీ దాటిపోయాయి. అందుకు కారణం - ఆ క్రితం రోజు సత్యసాయి నిగమాగమంలో జరిగిన అఖిల పెళ్ళి... తన చిన్నప్పటి స్నేహితురాళ్ళలో ధనవంతురాలు అఖిల... అయినా ఆమె ఎవరి ముందు ఎప్పుడూ తన ఆధిక్యతను ప్రదర్శించేది కాదు... డబ్బున్న వాళ్ళలో వుండే గర్వం - తన మటుకు వర్తించదన్నట్టు సౌమ్యంగా ప్రవర్తించేది... లేనివాళ్ళనూ ఉన్నవాళ్ళనూ అందర్నీ తన వాళ్ళుగానే గుర్తించేది...

అఖిల వివాహం తంతు చూసి కమల ఆశ్చర్యపోయింది. ఆమె ఏనాడూ అటు వంటి పెళ్ళి చూడలేదు. కళ్ళు రెండూ చాలవన్న మాటకు అర్థం తెలిసినట్టే అయ్యింది. రెండు వేల మంది ఆహ్వానితులు - అతిరథులై మహారథ వేషాల్లో వచ్చారు.... ఎక్కడో సినిమాల్లో, టి.వి. సీరియల్స్‌లో, కథల్లో జరిగే పెళ్ళి కళ్ళ ముందు 'ఏడడుగుల ఆర్భాటం'గా కన్పిస్తూంటే

కమలకు తను మరో లోకంలో వున్నట్టుగా తోచింది. కళ్యాణవేదిక మీద అఖిల శ్రీ మహాలక్ష్మిలా – రాజు శ్రీ మహావిష్ణువులాగా, బంధు మిత్ర సపరివారమంతా దేవలోకం నుంచి దిగివచ్చిన యక్ష, కిన్నెర, కింపురుషులుగా అనిపించారు. కమల చాలాసేపు తన కళ్ళు పెద్దవి చేసుకుని చస్తూ ఉండిపోయింది. హాలంతా నిండిన ఫెర్‌ఫ్యూమ్ మనసులోకి ప్రవేశించి ఆహ్లాదపరుస్తోంది. పెళ్లికి వచ్చిన ఆడవాళ్ళను, ముత్తయిదువులను చూస్తే వారు కట్టిన చీరలు – బంగారు నగలూ అలాంటి అదృష్టవంతుల వంటి మీద కాపురం చేయగల్గినందుకన్నట్టుగా మెరిసిపోతున్నాయి. కుర్రకారుని చూస్తే వాళ్ళు బొంబాయిలో సినిమా షూటింగ్ వదిలి వచ్చిన హీరోల్లాగ కనిపించారు.

అఖిల పెళ్ళి అయిన గంటకు తీరిక చేసుకుని స్నేహితలుందర్నీ కలిసింది... స్నేహితులందరూ అఖిలను వళ్ళంతా తడిమి తమ ఆప్యాయతను ప్రదర్శించుకున్నారు... ఆ తర్వాత అఖిల అందరినీ సాగనంపి కమలను తన గదిలోకి తీసుకువెళ్ళింది.

"చాలా బాగా జరిగిందే నీ పెళ్ళి–"

"ఎలా ఉన్నాడే, మా ఆయనగారు?" అంటూ నవ్వుతూ ప్రశ్నించింది అఖిల.

కమల నవ్వేస్తూ, "నా కనుమానంగా వుంది. అదే నీ మొగుడు. రాజు అనే మనిషి కాడేమోనే! శాపవశాన భూలోకంలో పుట్టి – నీ మెళ్ళో తాళి కట్టిన ఇంద్రలోక నివాసేమో!! ఎందుకైనా మంచిది – రాత్రుళ్ళు నీ భర్త మీద ఓ కన్ను వేసి వుంచు.. ఏ అపరాత్రి వేళో ఓ అప్సరస దిగి, నీతో భేటీ వేసుకుని అతన్ని తన్నుకుపోవచ్చు" అంది.

అఖిల ఆ మాటలకు ఊగిపోయి నవ్వుతూ, "ఆపవే, నీ పొగడ్తలు! నిజానికి, ఆ లోకం నుంచి ఇంద్రుడు చంద్రుడూ వచ్చేది నీలాంటి కుందనపు బొమ్మ కోసం" అంది.

"అఖిలా నువ్వు అదృష్టవంతురాలివి... నీకు ఆనందం ఎప్పుడూ తోడుగా వుండాలని కోరుకుంటున్నావే..."

అఖిల 'థ్యాంక్స్' చెప్పి గది తలుపు తోసుకు వచ్చిన భర్త రాజు లోపలికి రాకుండా ఒక అడుగు వెనక్కి వేయబోతూంటే, "ఇటు రావొచ్చు ఫరవాలేదు. నేను చెప్పిన కమల ఈమే" అంటూ కమలను రాజుకు పపరిచయం చేసింది.... కమల రాజుకు విష్ చేసింది.

రాజు అక్కడే వున్న మహారాజా చెయిర్‌లో కూర్చుని, "మీ గురించి అఖిల చెప్పింది... ఆమె మీకిచ్చిన ప్రపోజల్స్ గురించి ఆలోచించారా – ఏమంటారు?" అని అడిగాడు.

"కమలా... ఇది నీకు మంచి అవకాశమే... మేం ఇద్దరం నీకు తోడుగా ఉంటాం. అమెరికా వచ్చెయ్.. నీ చేతుల్లోనా చదువు ఉంది... ఇక్కడ వున్నావంటే బ్రతుకు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉంటుంది. ఇక్కడ వచ్చే జీతంతో నువ్వూ, మీ ఇల్లు ముందు పడేదెప్పుడు? పైగా పెళ్ళి కొడుకుల ధరలు చూస్తే మన ప్రొవిజన్స్ రేట్లు పెరిగినట్లు ఆకాశానికి తాకుతున్నాయి. ఈ వేళ లక్ష అడిగినవాడు – ఎల్లుండి అదే ధరకు దొరక్కపోవచ్చు..."

"ఏయ్... మా జాతిని మరీ దుయ్యబట్టేస్తున్నావు... అన్యాయం" రాజు నవ్వుతూ అన్నాడు.

"నువ్వు ఓ మూడేళ్ళ అమెరికాలో ఉన్నావంటే నెలకు కనీసం రెండు వేల డాలర్లు వెనకేయవచ్చు."

"నాన్న ఏమంటారో..."

"అఖిల చెప్పినదాన్ని బట్టి చూస్తే, మీ చదువు కొనసాగడం, ఉద్యోగం చేయడం ఇవన్నీ ఓ ప్లాను ప్రకారం జరిగాయనిపిస్తుంది. దీని వెనుక వున్నది బహుశా మీ నాన్నగారే అయ్యుంటారు. మీరు అవస్థల పాలవకుండా చేసింది ఆయన ఆలోచనా సరళే అయ్యుంటుంది."

"ఏ తండ్రికయినా కూతురికి పెళ్ళి చేసి అత్తవారింటికి పంపాలని ఉంటుంది గాని, అవివాహితగా అమెరికా పంపాలని అనుకోరేమో..."

"అది వెనకటి శతాబ్దానికి చెందిన తల్లిదండ్రుల ఆలోచనాసరళి – అఖిలా! ఇప్పుడు మనలాగే పెద్దవాళ్ళు కూడా ఇరవై ఒకటవ శతాబ్దంలోకి ప్రవేశిస్తున్నారు. మూఢ నమ్మకాలు, అర్థం లేని విలువల పట్ల అభిమానం, ఇంకా ఇంకా భయాలు – వీటికి అందరూ కలిసి చెల్లు చీటీ వ్రాసెయ్యాలి..."

"మీ సలహా నాకు శిరోధార్యమే. కానీ ఇప్పటికే నేను అప్పుల్లో వున్నాను... అమెరికా ప్రయాణం అంటే... అమ్మో..."

"అవన్నీ నేను చూసుకుంటాను... ఆ లెక్కలు అమెరికాలో తేల్చుకుందాం... సరేనా?"

"మీరు వెంటనే అఖిల చెప్పినట్టు చేయండి.... ఆమెకు మా విజువల్ సాఫ్ట్ వారి అప్లికేషన్ ఫారమ్స్, వీసాకు సంబంధించి పేపర్లు ఇచ్చాను. మీరు రెండు నెలలు గడిచేటప్పటికి కాలిఫోర్నియాలో ఉంటారు.. మా కంపెనీలో నాతో పాటు పనిచేస్తూ నాకు సహాయకారులవుతారు.... మరి నే వెడతాను, మళ్ళీ కలుద్దాం... బై" అంటూ రాజు ఆ గదిలోంచి బయటకు వెళ్ళాడు.

కమలకు అంతా మాయగా ఇంకా పోతే అయోమయంగా ఉంది. జరగిందంతా నిజమైనా, విన్న మాటలన్నీ సత్యాలయినా ఆమెకు అపనమ్మకమే కలుగుతోంది... ఎందుకో చటుక్కున కమల కళ్ళల్లో నీళ్లు తిరిగాయి... కళ్లు తుడుచుకుంది. ఏదో మాట్లాడబోతే ఆ ప్రయత్నమూ అంత సులువవలేదు....

"కమలా భయపడకే.... చిన్నప్పటి నుంచీ కలిసి చదువుకన్నాం. ఈ వేళ ఒకరికొకరు తోడవుతున్నాం... ఈ బాధలు, లేనితనం, అవమానాలు అన్నీ దూరమవుతాయి. అవును కదూ" అంది అఖిల లాలనగా.

"అదోలా అన్పిస్తోందే... నాన్నా, తమ్ముడూ గుర్తొస్తున్నారు. నాకు అప్పుడే విమానం ఎక్కి ఆకాశంలో ఎగిరిపోతోన్నట్టే వుందే!" అంది తన్మయత్వంతో కమల.

అఖిల నవ్వేసి, "అలానా పాపం... నాన్నా, తమ్ముడేనా, ఇంకెవరూ గుర్తుకు రావడం లేదా?" అని ముద్దుగా కమల వీపు మీద చరిచింది...

కమల "చాల్లే" అంటూ నవ్వేసింది....

అలా అఖిల కమలకు చాలాసేపు ఏవేవో సలహాలు యిస్తూనే వుంది... ఆ పైన కమల అఖిల దగ్గర శెలవు తీసుకుని కళ్యాణమంటపం దాటి బయటకు వచ్చింది... దారి పొడుగునా కూడికలు, తీసివేతలు చేసుకుంది. అవి ఇంటికి వచ్చి రాత్రంతా కొనసాగాయి. ఉదయం వంట గదికీ చేరాయి.

"ఏం అమ్మా వస్తున్నావా" అంటూ కేక వినబడడంతో కమల ముందు గదిలోకి వచ్చింది.

రామచంద్రం కమలను ఓసారి చూసి, "అలా కూర్చో నీతో కొంచెం మాట్లాడాలి..." అన్నాడు. కమల, ఖాళీగా ఉన్న కుర్చీలో కూర్చుని, "చెప్పండి నాన్నా" అంది. ఆయన నెమ్మదిగా తనకొచ్చిన ఆలోచనలు...అంత వరకు తను కమల పెళ్లి గురించి చేస్తూ వచ్చిన ప్రయత్నాలు – ఆ విశేషాలు, అన్నీ కూడా పూస గుచ్చినట్టు చెప్పాడు.

కమల తండ్రి చెప్పినవన్నీ వింది... ఆమెకు తన గురించి తండ్రి పడుతున్న ఆరాటం – అర్థమయింది. కాసేపు తనలో తను తండ్రితో ఎలా మాట్లాడాలో ఆ మాటల్ని మననం చేసుకుంది. ఓ నిర్ణయానికి వచ్చినదానిలా, "నన్నోమాట చెప్పమంటారా, నాన్నా" అంది. రామచంద్రం, చెప్పమన్నట్టుగా తల ఊపాడు.

కమల నెమ్మదిగా అఖిల పెళ్ళి విశేషాలు చెప్పి, ఆపైన అఖిలా, అఖిల భర్త రాజు చెప్పిన సలహాలు, చేస్తామన్న సహాయం, అన్నీ వివరంగా చెప్పింది...

రామచంద్రం కూతురు చెబుతోన్నవన్నీ వింటున్నాడు.... ఆయనకు – కాసేపు తన శ్వాస ఆగినట్టూ, ఆ తర్వాత అది వేగంగా సాగుతోన్నట్టూ... ఇంకా ఇంకా మనసులో ఒక పక్క ఆనందం, మరో పెద విచారం – అలా మనసులో ఏదో వివిధ రసాల సమ్మేళనం జరుగుతోన్నట్టుగా అన్పించింది. గతం, భవిష్యత్తుల మధ్య వర్తమానం – నేను ఉన్నానంటూ ప్రశ్నార్థకమై పక్కనే కూర్చున్నట్టుగా ఉంది!!

"అంతా నీ ఇష్టం నాన్నా... నువ్వే ఆలోచించి చెప్పు, నేనేం చెయ్యాలో...?"

రామచంద్రం అడ్డంగా తల ఊపి, "ఉహూ, అంతా నీ ఇష్టం... ఎందుకంటే నువ్వు ఇప్పుడు పెద్దదానివయ్యావు. నా కన్నా నువ్వు బాగా ఆలోచించగలవని నా నమ్మకం" అన్నాడు.

కమల ఆశ్చర్యంగా తండ్రి మొహంలోకి చూసింది.

❖ ❖ ❖

అరవై రోజుల పాటు – ఇటు హైదరాబాద్‌లో అఖిలా, అటు కేలిఫోర్నియాలో రాజూ త్వరత్వరగా, ఆగమేఘాల మీద గట్టి ప్రయత్నాలు చేయడంతో కమల అమెరికా ప్రయాణం

తేలిక అయ్యింది... అఖిల రెండు రోజులకొకసారి కమలను ఫోన్లో పలకరిస్తూనే ఉంది... ఏ రోజు ఎన్ని గంటలకు కాలిఫోర్నియా ఎయిర్‌పోర్టులో తనూ, రాజూ వుంటామో,ఎయిర్ ఇండియా విమానంలో కమల ఆనందంగా ఎలా ప్రయాణం చెయ్యాలో పూసగుచ్చినట్లు చెప్పింది... రాజు తను కమలకు హెచ్ వన్ వీసా ఎలా సంపాదించిందీ, వాళ్ళ కంపెనీలో కంప్యూటర్ ఇంజనీర్లు అమెరికన్ ఇంగ్లీష్ ఎలా మాట్లాడతారో, వాళ్ళ పొలైట్‌నెస్ ఎలా వుంటుందో చెప్పి నవ్వించాడు....

నెమ్మదిగా కమల ప్రయాణం –వారం రోజుల్లోకి వచ్చింది... రోజూ కమల తండ్రికి తమ్ముడికి – ఏవేవో చెప్తూనే ఉంది.... తండ్రి ఏ ఏ సమయాల్లో ఏ ఏ పనులు చేస్తే బావుంటుందీ – వేణు ఇంట్లో ఏం చెయ్యాలో, ఇంటిని ఎలా కనిపెట్టుకుని ఉండాలో ఒకటికి పదిసార్లు చెప్పింది....

ఆ వేళ కమల పని చేసే ఇనిస్టిట్యూట్ వాళ్ళు ఆమెకు వీడ్కోలు పార్టీ ఇచ్చారు. కానుకలతో పాటు శుభాకాంక్షలు అందజేశారు. కమల ఆ తతంగం పూర్తి చేసుకుని ఆఫీసు బయటకు వచ్చింది. ఆటో ఎక్కబోతూంటే ఆమెకు అటువైపుగా ఆనంద్ కన్పించాడు.

"నువ్వా ఆనంద్... ఇన్నాళ్ళూ ఎక్కడ ఉన్నావ్... ఆటో ఎక్కు చెబుతాను" అంది గుక్క తిప్పుకోకుండా. ముందు ఆనంద్, తర్వాత కమలా ఆటో ఎక్కారు.

ఆనంద్ ఆటోలోకూర్చుని నెమ్మదిగా అన్నాడు – "కమలా, నేను నెల రోజులుగా దుర్గాపూర్ కేంప్‌లో ఉన్నాను. నీ విజయయాత్ర గురించి నిన్ననే తెలిసింది. అందుకే నిన్ను కలుద్దామని వచ్చాను."

కమల తన ప్రయాణం గురించి చెప్పింది.

"పోన్లే... మన బ్యాచ్‌లో అమెరికా వెడుతూన్న అమ్మాయిల్లో నువ్వే మొదటి దానివి... కంగ్రాట్స్... మిగిలిన వాళ్ళందరూ పెళ్ళిళ్ళు చేసుకుని సంసారాల్లో పడిపోయారు.."

"మన స్నేహితుల్లో – పెళ్ళి చేసుకోనిదీ – ఈ గడ్డ వదలనిదీ కూడా నువ్వొక్కడివే... అది తెలుసా?" అని ప్రశ్నించింది కమల.

ఆనంద్ మాట్లాడలేదు.

"నువ్వూ అమెరికా వచ్చేయ్ ఆనంద్...ఇక్కడ వుండి ఏం బావుకుంటావ్? డబ్బుకు డబ్బూ సంపాదించవచ్చు... మీ ఇంటికీ మేలు జరుగుతుంది."

ఆనంద్ మళ్ళీ మాట్లాడలేదు. కమల తిరిగి అదే ప్రశ్న వేసింది.

"నిజమే కమలా... నువ్వు వెడుతున్నావంటే నాకూ అమెరికా రావాలనే వుంది..."

కమల వెంటనే అంది, "నువ్వు – ఊ, అను... నేను అఖిలతో, రాజుగారితో మాట్లాడతాను. అన్నీ వాళ్ళు చూసుకుంటారు... సరేనా..."

"వస్తే బాగానే ఉంటుంది... కాని..."

"ఏమిటీ... ఇంట్లో నీకేమన్నా ఇబ్బందులు ఉన్నాయా?" నెమ్మదిగా అడిగింది,

కమల...

ఆనంద్ తల ఊపుతూ, "లాభం లేదు కమలా... నేను అమెరికా వస్తే నాకు నష్టం... వద్దు... రాను..." అన్నాడు.

"ఇదేమిటి... మళ్ళీ...?"

"చెప్తాను... కానీ నే చెప్పేది విని నువ్వు నవ్వకూడదు. వెక్కిరించకూడదు..."

కమల సరేనని తల ఊపింది...

"కమలా, నేను అమెరికా ఎందుకు రానంటున్నానంటే నా రేటు - అదే - నాకు వచ్చే కట్నం రేటు పెరగడం నాకిష్టం లేదు... నాకు - నాకు నచ్చిన అమ్మాయిని ప్రేమించి పెళ్ళి చేసుకోవాలనీ - కట్నం తీసుకోకుండా ఆ అమ్మాయి మెళ్ళో పుస్తె కట్టాలని ఓ గొప్ప కోరిక ఉంది. ఈ కోరిక ఏర్పడి బహుశా ఐదారేళ్ళయింది.... నేను ఏ ఫారిన్ వెళ్ళి మంచి ఉద్యోగం చేశాననుకో - ఇక్కడ మా నాన్న కట్నం రేటు పెంచుకుంటూ పోతాడు. అలా జరక్కుండా వుండాలంటే, నా ఆశ నెరవేరాలంటే నేను ఇక్కడే ఉండాలి! ఇండియాలోనే ఉద్యోగం చెయ్యాలి!"

కమల ఆనంద్ మొహంలోకి ఆశ్చర్యంగా చూసింది... అతని మొహంలోని దిగులు, బాధ ఆమెను మాట్లాడకుండా అడ్డుకున్నాయి.

"ఓ చిన్న మాట కమలా.... నీలాంటి మంచి అమ్మాయి... సహృదయురాలు... భేషజాలు లేనిది - నీలా గొప్పగా నవ్వగల్గేది - పెళ్ళికాని ఓ అమ్మాయి అమెరికాలో నీకు కన్పించిందనుకో - ఆమెను పసిగట్టి వెంటనే నాకు ఉత్తరం వ్రాయి... ఆమె అక్కడ బాగా డబ్బు గణించి వుంటుంది కాబట్టి - మా నాన్న కోరే కట్నం వాళ్ళు తేలిగ్గా యివ్వగలుగుతారు. గుర్తుంచుకో" అన్నాడు; తెచ్చి పెట్టుకుని నవ్వాడు....

కమల పకపకా నవ్వింది... నవ్వుతూనే మొహాన్ని వివిధ భంగిమల్లో తిప్పింది... సరిగ్గా అదే సమయంలో, అలానే ఆనంద్ మొహంలోకి చూసింది... అతని విశాలమైన కళ్ళు. చక్కని శరీరాకృతి, స్నేహశీలతతో మధుర భరితంగా ప్రతిధ్వనించే కంఠం, ఆమెకు ఎప్పుడూ చూడనివిగా, ఏనాడూ కనీవినీ ఎరగనివిగా కన్పించాయి... ఆమె ఆశ్చర్యపోయింది.... పైగా తన లోపల ఏదో ఆరాటం, ఆనందం కలసి హృదయంలో సముద్ర మధనానికి సమాయత్తమవుతూంటే ఆమె కంగారుపడింది... కలవరపడింది... ఆనంద్ వైపు ఆపేక్షతో చూస్తూ ఆగిన ఆటో నుంచి దిగింది - ఇంటి ముందు!!

"నే వెడతాను కమలా" అన్నాడు ఆటో లోంచే ఆనంద్.

"లోపలికి రా ఆనంద్, మళ్ళీ ఎన్నాళ్ళకు కలుస్తామో - కాఫీ తాగి వెడుదువుగాని అంది..."

ఆనంద్ ఆశ్చర్యంగా ఆటోలోంచి దిగాడు! అదే ఆశ్చర్యంతో ఆమె వైపు చూశాడు!!

❖